# పెళ్లాంతో షైరేమిటీ?

కోర్కెలు ఎందుక్కలగ్గాలీ అంటే ఏం చెబుతాం? అవి కలుగుతాయి. అది వాటి లక్షణం. రావుకి ఆవేళ అర్జంటుగా... ఆఫీసుకి వెళ్ళిపోతున్నప్పుడే - ఆ సాయంకాలం సురేఖను తీసుకుని షైరుకి వెడదామనిపించింది. "అదో, వక్కపొడి డబ్బీలో వుంది. వేసుకు మరీ వెళ్ళండి! ఇవాళ ఆకుల్లేవు' ' అని భార్య వేసిన కేకకు మారుగా-

"అది సరేగాని, నువ్వోమారు యిలా రావోయ్!" అని ఎదురు కేక వేశాడు. అంతలోనే అద్దంలో తన ముఖం చూసుకుని, క్రాపు దిద్దుకున్నాడు.

"ఏవిఁటో! అంత అర్జంటు?" సురేఖ కొంగుకు చెయ్యి ఒత్తుకుంటూ బొడ్డున దోపిన కుచ్చిళ్ళు రెండోచేత్తో జారవిడుచుకుంటూ వచ్చింది.

"మనం సాయంకాలం షైరెడదాం! సిద్ధంగా వుండు" -గడియారం టంగున తొమ్మిదిన్నర కొట్టడంతో వులిక్కిపడి గుమ్మం అవతలకు వచ్చేశాడు రావు.

"షైరు?" అని ఆశ్చర్యపడి అంతలో అర్థం చేసుకుని "నిజంగానా!" అన్నది సురేఖ.

"ఆఁ ఆఁ నిజంగాను... షైరెడదాం!" కేకవేస్తూ వెళ్లి పోయాడురావు.

"ఈయనదంతా మరీ విచిత్రమమ్మా" అనుకుని భుజాలు విరుచుకుని, వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది సురేఖ. అంతలో ఏమో జ్ఞాపకం వచ్చినట్టుంది. ఏంలేదు. ఆయన షైరెడదాం అని చెప్పిన మాటే అది. "బాగానేవుంది వరస. సినిమాకండీ అంటే మా అక్కయ్యతో పో అనీ; దరిమిలా పక్కింటి సుభద్రమ్మగారితో పో. అని అనే మనిషిలో ఒక్కసారిగా ఇంత చైతన్యమా?-అది చైతన్యమే!

రావుకి ఒక విధవప్ప చెల్లెలున్నది. ఆవిడ మొన్న మొన్నటిదాకా తమ్ముడి సంసారం చక్కదిద్దుతూ సురేఖకి వంటపాఠాలు నేర్పుతూ ఇక్కడే వుండేది. సినిమా అంటే చాలు ఆవిడ వున్నన్ని రోజులూ, డబ్బులిస్తా అక్కయ్యతో వెళ్ళు; అనేవాడు భర్త. "డబ్బులట! వెధవడబ్బులు! ఎవరిక్కావాలి!" అని విసుక్కునేది సురేఖ.

"అయ్యో! అదేమిటే పిల్లా... ఎంత యిదైనా మొగుడిని వెధవ అంటావుటే!" అని నోరు

నొక్కుకునేది రావు అక్కయ్య.

"కాదులెండి. మిమ్మల్నే విధవంటా!" అనుకునేది మనసులో సురేఖ.

ఇవాళ అదంతా జ్ఞాపకం తెచ్చుకుంటూ గబగబా భోం చేస్తున్నది సురేఖ.

"కొంపదీసి మొన్న ఈయన మద్రాసునగరం వెళ్ళారు. అక్కడో, ఆమధ్య హైద్రాబాద్ వెళ్లింతర్వాతో - ఈ కోర్కె కలిగి వుంటుంది" అనుకుంది సురేఖ.

చదువుకున్న పిల్ల గనక యిట్టే గ్రహించింది సురేఖ.

నిజంకూడా అంతే. రావు ఆమధ్య హైద్రాబాద్ వెళ్లి అక్కడి ఓ సాయంకాలం చూసి, నాలుగు వారాలు తిరగక మునుపే అక్కణ్ణించి వచ్చి, మద్రాస్ వెళ్ళి రావడం సంభవించింది. అదే అతనిలోని ఈ చైతన్యం అనండి. విప్లవం అనుకోండి; సదరు కోర్కెకి కారణం!

రావు ఆఫీసుకి వెళ్లి తన సీట్లో కూచున్నాడేగానీ మనసు పనిమీదికి పోక, పరిపరి విధాల పోసాగింది. ఆమధ్య హైద్రాబాద్ వెళ్ళినప్పుడు ముందు ఆఫీసువాళ్ళను తిట్టుకుంటూ వెళ్ళినా, ఆనక ఎంత బాగుందని?

××××××

సాయంకాలం హైదరాబాద్ నగరానికి ఆటవిడుపులాగ వుంది. పంజాబీ వేషంలో కన్నెపిల్లలు, నైలాన్‌దుస్తుల్లో హిందుస్తానీ, మరాఠీ గుజరాతీ, పంజాబీ పడుచులూ, షైరు సాగేవేళ, ఉద్యోగప్రప్తులు యిలుపారేవేళ, టాంక్‌బండ్ కళకళలాడే వేళ, పబ్లిక్ గార్డెన్స్ మనోహరంగా వున్న వేళ; రావు అక్కడ "ఆహా! ఇప్పుడు నాతో సురేఖ ఉంటేనా?" అనుకున్నాడు. ఒకసారి కాదు. పదే పదే అనుకున్నాడు. సురేఖ ఈడుగల చిన్నది కనిపించినప్పుడల్లా అనుకున్నాడు. పచ్చని చాయతో నిండైన పడుచుపిల్లలూ తరుణజంటలూ; వెన్నెల్లో - వసరసుల్లో పువ్వుల్లా అక్కడక్కడ విరిసివుంటే అటూ యిటూ సందడిగా తిరిగేస్తో వుంటే, రావుకి వృధాపోతున్నట్లు అనిపించింది. టాంక్‌బండ్‌మీదకి తన మిత్రుడు తీసుకెళ్ళినప్పుడు; అక్కడ రావు గమ్మత్తయిన దృశ్యం చూశాడు. ఒక బొద్దు పాటి "నైలాను సుందరి" వయసు తిరిగి చాలా రోజులయ్యుంటుంది కాని, రెండు జెడలు, పరికిణీ,నైలాను ఓణీ వేసుకున్నది. ఆమె భర్త కాబోలు ఒక బక్క పల్చని వ్యక్తి, మరో నలుగురు, సుర్వా షేర్వాణీ అమ్మాయిలూ కలిసి, చపాతీలు... పచ్చి ఉల్లిపాయ ముక్కలు కొరుక్కుని మరీ హాయిగా తినేస్తున్నారు.

"ఓహో! టాంక్‌బండ్ పిక్‌నిక్ వచ్చారు కాబోలు" అనుకున్నాడు. వాళ్ళకేసి యిలా గుచ్చిచూశాడు రావు. "అయ్యో! ఒక్కసారైనా చదువుకున్నపిల్ల సురేఖను పిక్‌నిక్కైనా తీసుకువెళ్ళలేదు" అనుకున్నాడుకూడా.

ఐతే, ఆ "పిక్‌నిక్ కుటుంబం" రావునింత పిసరు ఖాతరు చెయ్యలేదు. ఇంచక్కా నాలుగూ తినేసి, 'ఆకులు పారేసి అంతెత్తున అట్నుంచి వెళ్ళిన "నడభవంతి" లాంటి డబుల్ డెక్కర్‌ని కూడా గమనించకుండా ఐస్‌ఫ్రూట్‌లు కొనుక్కొని తినడం మొదలెట్టారు!

రావు నవ్వాడు. అంతలో దిగులుపడ్డాడు. రావు మిత్రుడు "రా పోదాం" అంటూ బస్సెక్కించి

మరీ లాక్కుని పోయాడు.

బావుంది ఈ వూరు. అన్నీ పార్కులే! అసలు మూసీ నదే ఓ పార్కులాగుందే అన్నాడు. నవాబ్ పార్కులోవున్న ఐదువందల మందిని రక్షించిన మహావృక్షాన్నిచూశాడు. పబ్లిక్ గార్డెన్‌లోని రంగు దీపాలు, నీటిచిమ్మటాలు జ్ఞాపకం వచ్చాయి రావుకి. అంతలో హేడ్‌క్లార్కు వచ్చి రెండు క్షణాలు బల్లదగ్గర గప్‌చిప్‌గా నుంచొని "ఏమోయ్! లాటరీ కట్టావా?" అన్నాడు.

ఉలిక్కిపడి "అబ్బే! అబ్బే!" అన్నాడు ఫైలు తిరగేసి కంగారుగా తెరుస్తూ రావు.

"ఆహాఁ! అది వస్తే ఏయే ఖర్చులు ఎలా పెడదమా? అని పథకాలు వేస్తున్నావు కాబోలునని!' 'నవ్వాడు హెడ్ క్లార్కు. అది పళ్ళు కొర్కుతున్నట్లే కనిపించింది రావుకి.

ఐతే ఆలోచనలు రాకుండా మానవు. కోర్కెలు ఊహల నాసరాగా తీసుకుంటే అవి ఆలోచనల క్రింద తర్జుమా ఐపోతాయట - రావుకి ఓ మిత్రుడు చెప్పాడు. అసలు ఆమిత్రుడే మద్రాసులో మరి నాలుగురోజుల పాటు ఆమధ్య ఎక్కువ వుంచేసి, ఆఫీసు వాళ్ళ చేత చివాట్లుకూడా తెప్పించాడు.

మద్రాస్‌లో పాండీ బజార్‌లో సినీ స్టార్లు ఉంటారను కుంటే లేరు సరిగదా! అన్నీ ఎక్స్ట్రా మొహాలే! తనది కూడా ఓ ఎక్స్ట్రా మొహమే ననుకున్నాడు రావు.

ఛాచా! మీ ఊరు బొత్తిగా బాగులేదు అనేశాడు కూడా మిత్రుడితో! మిత్రుడు రావు వీపు తట్టాడు. దాని అర్థం తెలిసింది కాదు గాని రావు, తనూ నవ్వి ... "మా ఆవిడ చెప్పిందోయ్! ఇక్కడ సినీమా తారలు అటూ యిటూ పచార్లు చేస్తారటగా?"అన్నాడు.

కాని ఆ మర్నాడే ఆదివారం అవడంతో మెరీనా బీచ్‌కి తీసుకువెళ్ళాడు మిత్రుడు, "ఓహో ! ఇవాళేమైనా తిరణాలా?" అని అడిగాడు జనసందోహపు సందడిని చూసి రావు.

"భేష్! బాగుందిరా! ఆదివారమోయ్! ఆదివారం!! అంతకంటే మంచి పండుగ ఏమిటీ మద్రాసుకీ ?"అన్నాడు మిత్రుడు మూర్తి.

ఎఱ్రని,పచ్చని, నీలం రంగుల రకరకాల దుస్తులలో, కార్లల్లో , బస్సుల్లో జనం దిగబడుతూ వుంటే, ఎఱ్రని పూల కృష్ణతామర మొక్కలన్నీ తెల్లబోయి వెలవెల బోయాయి. సముద్రం దూరంగా "విరుచుకుపడ్డ నగరాన్ని" చూసి వెనక్కి తగ్గినట్లు గా వుంది, దగ్గరగా కార్లు, మనుషులు, బస్సులు, సింధీ సుందరాంగనలు పచ్చగా, చక్కగా రంగురంగుల సిల్కు దుస్తుల్లో నవ్వుతూ - కేరుతూ "నడిచే ఫలహారశాల"ల మీదకు ఎగబడుతూ వుంటే "వీళ్ళకి తిండి గొడవ తప్ప మరోటిపట్టదా" అనుకున్నాడు రావు. అంతలో ఓ చిన్నది నైలాను వోణీ వేసుకున్నది, అయిన్‌క్రీమ్ తింటున్నదేమో, ముందుకు ఒంగి మీద పడకుండా ఓ పెద్ద ఫీట్ చేస్తున్నట్లు తింటున్నది. ఈలోగా ఆపిల్ల "పయ్యెద" కాసేపు గగనవిహారం చేస్తానని అలాఅలా బయలుదేరిపోయింది! అదికూడా గమనించలేదు ఆ సింధీ చిన్నది. ఆ వింత నలా చూస్తున్న రావు నంతలోమరో కన్నె పడుచు ఢీ కొట్టేసింది. ఉలిక్కిపడి సగమైపోయిన రావుని గమనించనైనా గమనించకుండా వెళ్ళిపోయింది కూడా !

మూర్తి రావుని "సుండాల్ తింటావా?" అంటూ లాక్కుపోయాడు.

"అరే!" అన్నాడు రావు.

"ఏమిటన్నాడు" మిత్రుడు.

"ఉహూఁ! ఏంలేదు" అన్నాడు రావు.

ఓ సుందరాంగి, ఓ సూటుసుందరుడూ స్కూటర్ మీద జర్రున వచ్చి ఫుట్‌పాత్ దగ్గర దిగి, పచ్చిమిరపకాయ బజ్జీలు,మసాలాబజ్జీలూ కలిపి కొనుక్కుని తింటున్నారు. మొదట అనుమానం రావుకి కలిగింది యిది: యిందాకా ఆ చిన్నది యించక్కా కోతిపిల్లలా ("వాటేసుకుంది"అన్న క్రియకే అలంకారం వర్తించును) వాటేసుకు కూర్చుందిగదా భర్తని? తన సురేఖ కూడా అలా ఒక వేళ తను స్కూటర్ కొంటే చెయ్యగలదా? అని. అసలు మొదట తను ఆ సూటుసుందరుడిలా వుండాలికదా అనుకున్నాడు. తనకి "గుర్రం బుర్రమార్కు టై" లేదుకదా అని సరిపుచ్చుకున్నాడు. ఆ తర్వాతగదా! సురేఖ అలా కూచోగలదా?" అన్న ప్రశ్న.

"నైలాన్ బీచి" ఆ విధంగా వెనుకపడింది. బీచ్‌లో ఎక్కడ చూసినా షైరుకైవచ్చిన కుటుంబాలు, జంటలు, అడపా తడపా బ్రమ్మచారులు, వాళ్ళకి ముందుగా వన్నెల చిన్నెల సుందరాంగనలు!

"కాస్త నాజూకుగా, ఒయ్యారంగా, యిస్త్రీగా కనిపించిన పిల్లనల్లా స్టూడెంటనుకునే వాడినోయ్ కొత్తలో - కాని ఆనక తెలిసింది వర్కింగ్ గాల్స్"అని అన్నాడు మూర్తి.

"ఓహో చాలామంది టైపిస్టులు కాబోలేం?" అన్నాడు రావు .....

"అయ్యా రావుజీ... మీరేమో ఈ డ్రాఫ్టులో మెరీనా అని రాశారు. నేను టైపు కొట్టాకా ఆయన నన్ను కొట్టినంత చేస్తారు" అంటున్నాడు టైపిస్టు సుబ్బారావు తను తప్పరాసిన డ్రాఫ్టు తెచ్చి.

"ఛా!" అని స్వగతం అనుకుని ఊహాగానంలోంచి యివతలపడి "సారీ!" అని ఆ డ్రాఫ్టులో 'మెరీనా' ను 'మరియా'గా దిద్ది ఉస్సురన్నాడు రావు. మద్రాసులో గుర్రాల్లాంటి దొరసాని పిల్లల్ని చూపించి 'వీళ్ళే టైపిస్టులన్నా'డు మూర్తి.

"ఛీ! మాకూ ఉన్నాడు ఓ టైపిస్టు!" అనుకున్నాడు సుబ్బారావుని చూసి.

మద్రాసునుంచి వస్తూనే సురేఖకు మొదట రావు చెప్పింది యిది, "మద్రాసులో అంతా పిల్లలితో సహా క్యారేజీలో ఇంత తిండి, మరచెంబులో నీళ్లు పట్టుకుని బీచ్‌కివస్తారు తెలుసా? అక్కడ బీచ్‌లో కాకులు క్రికెట్ ఆడతాయి తెలుసా?" అనీను.

"అదేమిటండి?" -సురేఖవి అసలే అందమైనకళ్ళేమో' మరీ పెద్దవిచేసుకుని రావుని చూసింది.

"అంటే వేరుశనగ పలుకులు ఒక అణావి - లెక్కపెట్టి యిస్తారులే. కొని ఎగరేస్తూ ఉంటావేనుకో! వాటిని నీ నెత్తిన ఎగిరి కాళ్లతో డోకుతూ, యిట్టే ఎగరేసుకుపోతాయన్నమాట. మన 'టెస్టు' ఆటగాళ్ళకన్నా బగా 'క్యాచ్ చేస్తాయవి; మూర్తిగాడు అన్నాడు" అని గొప్పగా చెప్పాడు కూడాను. అదే జ్ఞాపకం వచ్చింది. వెంటనే లేచి నిల్చున్నాడు.

సురేఖ సిద్ధంగా వుండి వుంటుంది. ఇక షైరుకి పోవాలి అనుకున్నాడు.

కానీ "మేనేజరుగారు పిలుస్తున్నారు!" అన్నాడు రంగయ్య వచ్చి.

"కొంపదీసి మళ్ళీ ఏ మెరీనా అనో డ్రాఫ్టులో తప్పు రాయలేదు. కదా?" అనుకుంటూ వెళ్ళాడు.

3

"అమ్మో! ఏమిటండీ అలా బాదేస్తున్నారు? వస్తున్నా"అని తలుపు తీసింది సురేఖ!

రావుకి భార్యని చూడ్డంతోనే ఒళ్ళు మండిపోయింది. కుచ్చిళ్ళు పైకితీసి బొడ్లో దోపుకుంది. చేతులకుమసి ఉంది కాబోలు. ముంగురులు సవరించుకుంది కాబోలు - నుదుట కుంకుమబొట్టు ప్రక్కనే మసిచార, చెమట కారుతోంది మొహంలో తలనిండా వెలిబుగ్గి అక్కడక్కడా ..

"కూలిచేసి వచ్చావా! తట్టలు మోశావా?"

"అయ్యో-సాధిపాంవీ? మీవారి పొలాలా? మావారి లోగిళ్ళా? ఎక్కడ చేయను కూలి? రండి లోపలికి. బజ్జీలు వొండేను?"నవ్వుతూ దారితీసింది.

"ఛీ కర్మ! ఆఫీసులాగే వుంది ఆలి కూడాను. షైరెడదామని ఏడిస్తినిగా?

"అరెరె! రండి రండి. క్షణంలో వచ్చేస్తాను" నాలిక్కరుచుకుని వంట యింట్లోకి పరిగెత్తి బజ్జీలు ప్లేటులో తెచ్చి యిస్తూ "ముందవి తినండి.నేనిక్కడున్నట్లు తయారై వస్తాను" అన్నది.

కుర్చీ బర్రున ఈడ్చి కూర్చొని "త్వరగా దయచెయ్" అన్నాడు.

బజ్జీలు చాలా బాగా చేస్తుంది సురేఖ. తాపీగా నాలుగు తిని "అయిందా?" అని కేకవేశాడు లోపలికి.

"ఇదుగో వచ్చే" నని అట్నుంచి కేక.

"అక్కయ్య గనక ఉంటేనా? యిలా షైరు గియిరూ నైజాన్తా అనేది" అనుకున్నాడు రావు. అక్కయ్య ఈ మధ్యనే "నీ పెళ్లాం నాయకురాలయిందిరా! ఫర్వాలేదు" అని సురేఖకో కితాబు కూడా ఇచ్చి మరీ ఊరెళ్ళింది.

సురేఖ కుచ్చిళ్ళు సరిచేసుకుని దోపుకుంటూ ఒకచేత పైట సవరించుకుంటూ "మీకు అక్కడ సోపూ, నీళ్ళూ పెట్టాను వెళ్ళండి" అంది.

ఆ పిల్ల ఖటాన్ వాయిల్ చీరె కట్టుకుంది. అల్మారాలో దాచివున్న గాజులు కూడా తీసి చేతులకు వేసేసుకుంది. మెడవార పౌడరు కనిపిస్తూనే వుంది. మొహాన చిరుచెమటలకి అప్పుడే పౌడరు కారుతోంది!

"ఏమిటా వేషం! అప్పాయమ్మలాగ! సిల్కుగుడ్డలేం లేవు కాబోలు" విసురుగా దుఃఖం దిగమింగుకుని, ఆఖరిబజ్జీ తిననా? మాననా? అని సందేహంలో పడ్డట్టు ఒక్క క్షణం ఆలోచించి ప్లేటులో పడేసి పెరట్లోకి వెళ్ళి పోయాడు.

"ఛీ! సిల్కుగుడ్డలు వీధిలోకి వేసుకు వెడితే వొంటి నుండవు" అని జవాబిచ్చింది సురేఖ. పయటంచు నడుంమీద కంటా తీసుకుని జాకెట్టుకీ, చీరకట్టుకీ మధ్య మిగిలిన జాగాను కప్పుకుంటూ.

"కర్మ అనుకో! అసలు నువ్వు స్కూలుఫైనలు తగలేశావంటే ఎవరైనా నమ్ముతారూ?" అన్నాడు చొక్కాప్యాంటులో ఆదరాబాదరా దోపుకుంటూ.

"అసలింతకీ షైరే కదా వెళ్ళాలి? అంత హడావుడి ఎందుకూ? సినిమాకి కాదుగా?" చేతిరుమాలు అందిస్తూ అసలు సమస్యను ఎదుట పెట్టింది అమాయకంగా సురేఖ.

"ఔను సుమా! ఇది మనవూరుకదూ? ఎక్కడికి వెళతాం? అరెరె! ఒక సముద్రమైనా లేదు ఈ వూరికి. పోనీ పార్కు? ఉహూఁ... అది పార్కేకాదు. వెళ్ళలేం అక్కడికి" .దువ్వెన జేబులో పెట్టుకుని, పాకెట్ రుమాలుతో తలదువ్వు కోబోయాడు రావు.

"అయ్యో! అంత యిదెందుకండీ... అలా బజారు కెళ్ళి ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్న... యిడెన్లపాత్ర కొనుక్కొచ్చుకుందాం" అన్నది సురేఖ ఒకటో ఎక్కంతో చేయాల్సిన లెక్కను చేసినంత సులువుగా.

"నాన్ సెన్సు.. అదా షైరు?" అంటే... ఉగ్రుడై పోయాడు. "మరేది? ఈ వూళ్లో పార్కులు .. సంద్ర తీరాలు లేవుగదా? సినిమాకి వెళదామా?" అడిగింది అసలు కోర్కెను ఎట్టకేలకు బయటపెట్టి సురేఖ.

"అంతే మరి - నీ మొహానికి తగ్గట్టే వూరూను".

మునిసిపాలిటీ చైర్మనుకూడా కాదు సురేఖ నాన్న. బడిపంతులు. ఐనా, భార్యని తప్ప ఎవర్ని తిడితే ఎవరూరు కుంటారు?

"ముందు పద" అన్నాడు గడియారం ఆరుకొట్టేసిన పావుగంటకి బయటపడ్డారు ఆ జంట.

కొత్తగా వుంది సురేఖకు. పెళ్లయి ఏడాది అయినా, భర్తతో నడిచి ఒక్కర్తీ ఎప్పుడూ బజారులోకి రాలేదు. చెప్పులు కొత్తవి - కాస్త ఎత్తుమడమలున్నాయి కూడాను - దానికి తోడు రోడ్డుమీద పోయే ప్రతీవాడు తననే చూస్తున్నాడేమోనన్న భీతీ, కోపం, ఉక్రోషం ! భర్త - ఒక్కటే, పదిగజాల ముందుకో - లేదూ గజం ఎడంగానో అయిపోతూ రావడం ... కళ్ళతోనే బోలెడు విసుగుదల చూపడం ఆ పిల్లకు మరీ చిరాకు కలిగించింది.

"అబ్బ! అన్ని గాజులు వేసుకోపోతే ఏం?" అన్నాడొక సారి భార్యను చూసి.

ఒకపక్క చెప్పులు కుక్క పీకినట్లు పీకుతూవుంటే - "ఇదేమిటమ్మా.. ఈయన బాధ" అనుకుంది.

"అసలు తన పిచ్చిగాని, తన భార్య నైలాను సుందరి ఎలా అవుతుందీ?" లోపల లోపల భార్య వేషం,నడక నచ్చక బాధపడుతున్నాడు రావు.

అసలు రావు ఉద్దేశంలో మొదటినించీ సురేఖవి హంసనడకలు - అసలా పిల్లే అందాలభామ. ఏ "స్టారూ" పనికిరాదని మురిసి పెళ్లాడాడుకూడా. కాని ఇప్పుడో "అబ్బే, ఆఖరికి చీర కట్టుకోడం కూడా రాని, నడవడం చాతగాని వుత్త - యిది"గా తోచింది.

ఈలోగా, సురేఖ అట్నుంచి చిన్నపర్వతంలా వస్తోన్న మునిసిపాలిటీ గజేంద్రుణ్ని... అనగా వరాహమునుఎలా తప్పుకోడమా? అని నిలబడిపోయి బెదిరినంతై, దిక్కులు చూస్తున్నది. నిర్దాక్షిణ్యంగా ఆ పంది సురేఖను వదిలి రావు ప్యాంటును రాసుకుంటూ మరీ పోయింది!

"ఛీ! నీతో షైరేమిటీ?" పెళ్ళాన్ని చూసి ఏడుపు మొహం పెట్టాడు.

ఇంతలో అట్నుంచి "టాంకు"లాగా రానేవచ్చింది లారీ. పోయినవారం కాబోలు కురిసింది వాన అయినా రోడ్లో అసలు సిసలు జలాశయాలులాగ నీళ్ళకుంటలున్నాయి. లారీ చక్రం ఛళ్ళున్న నీళ్ళు త్రుళ్లించి మరీ వెళ్ళిపోయింది.

"అయ్యో! మీ ప్యాంటు " అన్నది సురేఖ అవతలి వేపుకు తప్పుకుని. ప్యాంటే కాదు. రావు చొక్కామీద కూడా బురద చిందింది.

"రిక్షా!" అన్నాడు గట్టిగా రావు.

"ఎందుకండీ?" అడిగింది సురేఖ.

"చావడానికి!"

రిక్షావాడు వచ్చి గంట కొట్టాడు. "ఊర్వశిలో 'రంభ' సరికొత్త బొమ్మ... యిప్పుడే మాటనీ వదిలినాడు రండి" అన్నాడు.

"అది వెధవహాలు" అంది సురేఖ

"మనది వెధవబ్రతుకు. మరోహాలుకి టిక్కెట్లు దొరకవు" అన్నాడు రావు.

ఆ విధంగా షైరు సినిమాగా మారడంతో రిక్షావాడు "ముప్పావలా" అని గంటకొట్టి మరీ చెప్పాడు.

"అరణాలు" అన్నాడు రావు.

"మీరొక్కరే అవుతేను" అని వాడు తిప్పేసుకుంటున్నాడు కూడా బండి.

"సరే! ఇదీ ఈ వెధవవూరు వ్యవహారం" అనుకుని రిక్షాలోకి ఎక్కాడు..

"అసలు ముందే ఆ సినిమాకే పోతే, ఈ బాధ వుండునా?" అన్నది సురేఖ - రిక్షాలో కూచున్నాక స్థిమితంగా రోడ్లకేసి వింతగా, ఆసక్తిగాచూస్తూ.

"ఆహాః! వెధవని! నాకు ఈ వూరు, ఈ పెళ్ళాం జ్ఞాపకం వుంటేగా... ఎక్కడో మరో సముద్రంలో ఏడిశానుగా"అంటూ ఊరిమీద కోపం ఆలిపై చూపాడు రావు.

బాల్కనీకి తప్ప మరో టిక్కెట్టులేదు. సరేనని దుఃఖపడుతూనే రెండున్నర తీసి యిచ్చాడు రావు

చీకట్లో తడుముకుంటూ హాల్లోకి వెళ్ళేసరికి "రోజుకు ఒక రిక్సోనా వాడి చర్మసౌందర్యం కాపాడుకుంటున్న సినీతార 'రీలు' అయిపోతోంది.

ఎట్టకేలకు ఒక వరసలో వున్న పెద్ద మనిషిని అటు జరగమని బ్రతిమాలి, రెండు వరససీట్లు సంపాదించగలిగాడు రావు.

కూర్చున్నాడు కానీ ముళ్ళమీద కూచున్నట్లే వుంది. "వెధవదీ బాల్కనీ అంటారు. రెండేసి కుర్చీలకు ఒకటే చెయ్యి" అని విసుక్కున్నాడు. తన చెయ్యీ, భార్య చెయ్యీ ఒక కుర్చీ చెయ్యిమీద ఒకదానిమీద ఒకటి పెట్టుకుంటే బాగానే ఉందిగాని ... సురేఖకు అవతలి కుర్చీలో బొద్దుపాటి మీసాల వ్యక్తి కూచుని తన మోచేయి దబాయించి మరీ సురేఖ ఒళ్లో ఉందా అన్నంత "యిది"గా పెట్టుకున్నాడు. అదీ రావు బాధ. సురేఖ సినిమా చూసేస్తోంది.

"సరే! ఇది సినీమా! ఇక్కడ రెండు కుర్చీలకు ఉమ్మడి చెయ్యి వుండును" అని పదిసార్లు సద్దుకుని సినిమా చూద్దామనుకున్నాడు రావు.

"ఏమండీ!" అంది సురేఖ.

ఆ పిల్ల ముందుసీట్లో వ్యక్తి అరడగులుండి వుండాలి! అందుకని సురేఖకి సినిమా సగం మాత్రం కన్పిస్తోంది.

సీటు మారి, సురేఖను యిటు రమ్మని, దబాయించి తన మోచెయ్యి మీసాలవ్యక్తి వొళ్ళో అన్నంత యిదిగా పెట్టుక్కూచున్నాడు రావు.

రెండు సీనులేనా కాలేదు. విలన్ హీరోయిన్‌ని కొడుతున్నాడు తెరమీద. ఇంతలో సురేఖ "ఏమండీ!" అంది చెవి దగ్గరగా. "వీడెవడో చుట్ట కాల్చి చంపేస్తున్నాడు. నాకు డోకు వస్తోంది బాబూ " అంది రహస్యంగా .

"భగవంతుడా!" అనుకున్నాడు రావు. దేవుణ్ణి ఎన్నడూ అంత భక్తితో తల్చుకోలేదతగాడు! సరె, ఆ చుట్టరాయుడికి ఏం బుద్ధి పుట్టిందో అది మానేశాడు.

మళ్ళీ మరో సీనులో దొంగలు హీరోయిన్‌ను మంచంతో సహా ఎత్తుకుపోతో వుంటే "ఏవండీ!' ' అంది సురేఖ. ఈసారి ఆందోళన, భయంకూడా వ్యక్తమయ్యింది ఆపిల్ల కంఠంలో.

"ఎందుకేం?ముందు సినిమాచూడు" విసుక్కున్నాడు.

అదీ, షైరుకెళదామనుకున్న కొత్త ఆలు మగల సాయంకాలం, సంతోషం, సరదాషైరూ...

"అది కాదండీ! పెరటి తలుపు గడియ వెయ్యలేదండీ" - సురేఖ చెప్పేసింది.

"ఏమిటీ?" రావు గుండెలు విలన్ పారిపోతున్న జీపు వేగంతో కొట్టుకున్నాయి.

"అయ్యో! ఆఫీసు సొమ్ము డ్రాయర్లో వుంది. పద!" వెంటనే తేలు కుట్టినట్లు లేచాడు, వెనుకనే సురేఖ బయలుదేరింది. ఆ పిల్లకి చాలా భయంగా వుంది. భర్త తిడతాడని కాదు. కొంప దోచుకుపోయారేమోనని....

నలుగురి కాళ్ళు, ఇద్దరి వ్రేళ్లూ తొక్కేసి యివతల పడేసరికి - హోరున వాన! కన్నీళ్ళ పర్యంతం అయింది దంపతులకి.

"రెండు రూపాయిలు" అడిగాడు రిక్షావాడు.

రిక్షాలో కూచున్నా, వాన నిర్దాక్షిణ్యంగా నాలుగు వేపులనుంచీ మొత్తేసింది.

"పాడు వూరు - పాడు బ్రతుకు?" తిట్టుకునే ఓపిక లేక గొణుక్కున్నాడు రావు.

నీళ్లోడుతూ, గుమ్మంలో ఆందోళనతో దిగేసరికి చూరుక్రింద మూటపట్టుకుని ఎవరో కూచున్నట్లుంది.

"ఓరి మీ యిల్లు బంగారంగాను - ఎక్కడికి పోయారర్రా? " అన్నది రావునీ, సురేఖనీ చూస్తూనే వాళ్ళ విధవప్ప చెల్లెలు.

"నువ్వేలా తగలడ్డావ్?" అనబోయి అంతలో తమాయించుకుని "ఎప్పుడు వచ్చావ్? అక్కా" అన్నాడు.

"ఇందాకే పాసింజేరులో" అంది ఆవిడ!

"ఆ వచ్చేదేదో మధ్యాహ్నం వస్తే దండగే లేకపోను" అన్నాడు మెల్లిగా, తలుపు త్వరగా తీస్తూనే.

సురేఖ లోపలికి పరుగెత్తింది. పెరటితలుపు తీసేవుంది!!

దొంగలు రాలేద్దు గానీ పిల్లి వంటయింట్లో అన్నీ తిరగదోసి తాటాహూటంచేసి వెచ్చగా పొయ్యివార పడుకున్నదల్లా లేచి, "మియాఁవ్" అన్నది సురేఖను "షైరు బాగుందా పిల్లా?" అని భోగట్టా చేసినట్లు.

"ఆఁ! నా మొహంలాగుంది! ఛీ, ముండా!", అని ఒక్కటి వడ్డించింది గరిటతో దాన్నెత్తిన.

"అయ్యో! నీ అబసంతితనం కూలా! పిల్లి వస్తుందని తెలియొద్దే నీకు? ఏడాదైంది కదా కాపురానికొచ్చి?" అన్నది విధవప్ప చెల్లెలు దవడలు నొక్కుకుని.

"సరే!... ఒరే తమ్ముడూ! నే మడిగట్టుకు వండేస్తాగానీ యిలోగా మూటలో అటుకులు న్నాయి ... - ఆ తడిగుడ్డలిప్పి అవతల పారవేసి పొడిదేదో కట్టుకురా!" కేకేసింది రావుని.

"వద్దురా బాబూ వద్దు!" లెంపలు వేసుకున్నాడు రావు. తడిగుడ్డలతోనే టేబుల్ డ్రాయర్ లాగి ఆఫీసు పైకం వుందని చూసుకుని, స్థిమితంగా చతికిలబడి!

(1959 తారక)